క్లుప్తంగా

క్రీడా పరికరాలు, దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడా పరికరాలు, దుస్తులు అందజేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

రాయవరం: మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం క్రీడా దుస్తులు, పరికరాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రిమ్మలపూడి వేణుగోపాలదొర కుమారుడు శ్రీరామ్, సాయిరామ్ చైతన్యల విరాళాలలతో ఈ క్రీడాదుస్తులు, పరికరాలు అందజేశారు. రూ.15 వేల విలువైన స్పోర్ట్స్ డ్రెస్, రూ.26 వేల విలువైన గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆర్టికల్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్టు తరపున ఎంపికైన వాసంశెట్టి బాలగోపాల్, యు.దుర్గాజయదీప్‌లను అభినందించారు. హెచ్ఎం సత్తిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ వి.విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ వాసంశెట్టి రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ కె.మాధవరావు, పీడీ బి.రాఘవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయ ఈఓగా శ్రీదేవి



ఈఓగా బాధ్యతలు చేపడుతున్న శ్రీదేవి

కె.గంగవరం: కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయ ఈఓగా ఎం.శ్రీదేవి నియమితులయ్యారు. ఆమె వెంటూరు గ్రూప్ టెంపుల్స్ ఈఓగా బాధ్యతలు చేపడుతూ అదనంగా కోటిపల్లి ఆలయానికి కూడా బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఆమె కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటానని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానన్నారు. ఆలయ అర్చకులు నూతన ఈఓకు సాదరంగా స్వాగతం పలికి ఆశీర్వచనం ఇచ్చారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి



ఆర్డీఓ సింధూకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామచంద్రపురం, కె.గంగవరం: కె.గంగవరం బస్టాండ్ వద్ద సులభ్ కాంప్లెక్స్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ప్రజా సంఘాల నేతలు అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా నాయకుడు వి.భీమశంకర్ మాట్లాడుతూ 2002లో కె.గంగవరంలో మెయిన్ రోడ్డును ఆనుకుని బస్టాండ్ నిర్మించారన్నారు. ఇది సుమారు 26 గ్రామాల ప్రజలు, విద్యార్థులకు ఆధారమన్నారు. బస్టాండ్‌లో సులభ్ కాంప్లెక్స్ పేరుతో నిర్మించిన మరుగుదొడ్లు, స్నానపు గదులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వీటిని పునర్నిర్మించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆర్డీఓ పి.సింధూ సుబ్రహ్మణ్యం, రామచంద్రపురం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించామన్నారు. పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ, కాశీ లెనిన్‌బాబు, ఎ.ఆంజనేయులు, కొలగాటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

102 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ జీవీ గీతాంజలి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీలలో 102 మంది గర్భిణులకు సోమవారం ఉచితంగా పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఐదుగురు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన పరీక్షలకు సిఫార్సు చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, జీవీ గీతాంజలి, పి.చంద్రమౌళి, కరుణేంద్రకుమారిల పర్యవేక్షణలో పరీక్షలు చేశారు. అంగర పీహెచ్‌సీలో 33 మంది, అచ్యుతాపురంలో 24, వాకతిప్పలో 19, కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో 16 మంది గర్భిణులను పరీక్షించారు. ఆరుగురుని హై రిస్క్‌గా గుర్తించారు. కోరుమిల్లి మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, అంగరకు చెందిన వ్యాపారవేత్త రాగం రామచంద్రరావు గర్భిణులకు బిస్కెట్లు, ఆపిల్ జ్యూస్ అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, ఎంపీహెచ్ఎలు పి.సురేష్, కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమానికి గట్టి చర్యలు

- అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం
- సొంత భవనాలే లక్ష్యంగా కృషి
- మండపేట నియోజకవర్గంలో 11 భవనాల నిర్మాణానికి నిధులు
- ఒక్కోదానికి రూ.16 లక్షల చొప్పున మంజూరు



శ్లాబు నిర్మాణం పూర్తయిన దశలో మండపేట మండలం కేశవరం- 2 అంగన్‌వాడీ కేంద్ర భవనం



కపిలేశ్వరపురంలో పోషకాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

కపిలేశ్వరపురం: భావి భారత పౌరుల విద్యా, వైజ్ఞానిక, ఆరోగ్య మెరుగుదలకు కేంద్రంగా అంగన్‌వాడీ కేంద్రం నిలవాలన్నది ప్రభుత్వ ధ్యేయం. సమాజాన్ని సమూలంగా మార్చేందుకు నేటి బాలలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో పాటు అవగాహనతో మెలగాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ బలోపేతం చేస్తోంది. అందుకోసం అన్ని విభాగాల్లోనూ పూర్తి సాంకేతికతను సద్వినియోగం చేస్తుంది. రెండు నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఈ కథనం..

రెండు నియోజకవర్గాల్లో అంగన్‌వాడీ కేంద్రాలిలా.

రెండు నియోజకవర్గాల్లో 511 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. రామచంద్రపురం మండలంలో 91 మెయిన్, ఆరు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. కె.గంగవరంలో 88 మెయిన్, 4 మినీ, కాజులూరు మండలంలో 76 మెయిన్ 4 మినీ మొత్తం 269 కేంద్రాలున్నాయి. కపిలేశ్వరపురంలో 78, రాయవరంలో 70, మండపేట మండలంలో 94 మొత్తం 242 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి.

పక్కా భవనాలకు నిధులు

మండపేట నియోజకవర్గంలో 11 అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించేందుకు నాడు - నేడు ఫేజ్ -2 లో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షల చొప్పున మంజూరు చేయగా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. మండపేట మండలానికి 9, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 11 అంగన్‌వాడీ భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంకలో పునాది నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మండపేట మండలంలోని చినద్వారపూడి, కేశవరం 6, కేశవరం 2, కేశవరం 7, ద్వారపూడి 3వ నంబర్ భవనాల శ్లాబ్ నిర్మాణాలు పూర్తయ్యాయి. ద్వారపూడి 10, భవనాలు శ్లాబు స్థాయి వరకూ నిర్మాణాలు పూర్తయ్యాయి. ద్వారపూడి 6వ నంబర్ కేంద్రం ప్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. ద్వారపూడి 12, ద్వారపూడి 2 పునాది దశలో పనులు జరుగుతున్నాయి.

పోషకాహార ప్రాధాన్యతపై ప్రత్యేక కార్యక్రమాలు

అంగన్‌వాడీలు ప్రజల్లో పోషకాహారం ప్రాధాన్యతపై ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. రోజువారీ విధులతో పాటు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ప్రత్యేక పోషకాహార స్టాళ్ళను నిర్వహిస్తున్నారు. తక్కువ ఖర్చులో బలవర్ధక ఆహారాన్ని తయారు చేసుకునే పద్ధతులను ప్రజలకు వివరిస్తున్నారు. వాటికి తోడు గర్భిణి, బాలింతల ఆహార విధానాలపై పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి



అర్తమూరు శిబిరం వద్ద సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి తదితరులు

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు అన్నారు. అర్తమూరు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలన్నారు. శిబిరంలో 332 మందికి వైద్య సేవలు అందించారు. 82 మందికి కంటి పరీక్షలు చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎంపీడీఓ ఐ. రాజు, ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 105 రకాల బ్రాండెడ్ మందులను శిబిరం వద్ద రోగులకు అందుబాటులో ఉంచారు. రోగి సమస్యను బట్టి వైద్యులు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు మండల సుమలత, సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు గొలుగూరి సందీప్‌రెడ్డి, కర్రి వీర్రెడ్డి, గొలుగూరి శ్రీనివాసరెడ్డి, కొండా సూరిబాబు, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, తేతలి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టేకిలో 687 మందికి ..

కపిలేశ్వరపురం: మండలంలోని టేకిలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వివిధ విభాగాల వైద్య నిపుణులు 687 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను చేశారు. శిబిరాన్ని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.చంద్రమౌళి, సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి పర్యవేక్షించారు. అత్యధికంగా గర్భకోశ వ్యాధులు సంబంధించి 261ని పరీక్షించారు. పలువురికి మెరుగైన చికిత్స అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించేందుకు నిర్ణయించినట్టు ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. శిబిరంలో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు రాకేష్ కృష్ణ చౌదరి, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఆర్థో నిపుణులు ఎం విజయదుర్గ, ఈఎన్‌టీ నిపుణులు బీకే అర్షతున్నీషా చికిత్స చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి, ఎంపీఈఓ పీడీడీ బిషప్, ఎంపీహెచ్ఎస్ వీఎస్ కామేశ్వరరావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని మండల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం కుయ్యేరు సచివాలయంలో సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు రఘురచన, వినయ్, స్వాతి, సుప్రియ, శ్రేయ, సతీష్ తదితరులు 585 మంది రోగులను పరీక్షించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని, 40 మందిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు పంపామని వైద్యాధికారి సుప్రియ తెలిపారు. ఎంపీపీ మాత భారతి, సర్పంచ్ కోమలి వెంకటరమణ, దొమ్మేటి కొండ తదితరులు పాల్గొన్నారు.

ఉండూరులో 337 మందికి..

రామచంద్రపురం రూరల్: ఉండూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 337 మందికి వైద్య సేవలు అందించారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ సీహెచ్ రామలక్ష్మి, ఎంపీటీసీ ఇంత కనకదుర్గ, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పీఏసీఎస్ చైర్మన్ దంగేటి వెంకటరమణ (చినబాబు), ఉప సర్పంచ్ రజనీకుమార్ ప్రారంభించారు. ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎస్.ప్రశాంతి, ఆదినారాయణ, కిమ్స్ ఆసుపత్రి ప్రసూతి వైద్యురాలు లిధియ, జనరల్ సర్జన్ ఆనంద్‌లు రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు న్యూట్రిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, తహసీల్దార్ జి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుందర్‌లాల్, హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సీహెచ్ఓ వీరవేణి, పీహెచ్ఎన్ సుబ్బలక్ష్మి, హెచ్‌వీ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



దంగేరులో ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. దంగేరు ఉన్నత పాఠశాల వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా అందిస్తుందన్నారు. ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఎంఈఓ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



టేకి వైద్య శిబిరం వద్ద పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్



కుయ్యేరులో రోగికి ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు



ఉండూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్డును వృద్ధురాలికి అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటేశ్వరరావు

వెదురుపాకలో వైభవంగా పేటతుళ్లి



వెదురుపాకలో పేటతుళ్లి కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో అయ్యప్ప స్వాములు పేటతుళ్లి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గురుస్వామి బందారు వెంకటరమణ ఆధ్వర్యంలో అయ్యప్పలు ఈ వేడుకలో పాల్గొన్నారు. మాలధారణ చేసి 40 రోజుల పాటు దీక్ష తీసుకున్న అయ్యప్పలు చివరలో వివిధ రకాల రంగులు పూసుకుని, బుడగలు కట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ పేటతుళ్లిలో గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. దైవం దృష్టిలో ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అందరూ సమానమేనన్నారు. కార్యక్రమంలో వెదురుపాక అయ్యప్పలతో పాటుగా, వి.సావరం అయ్యప్పలు కూడా పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



అంబాజీపేటలో పథకాలు సాధించిన క్రీడాకారులు

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో అంబాజీపేట క్రీడాకారులు 12 బంగారు, 7 వెండి, 6 కాంస్య పతకాలను సాధించినట్లు అంబాజీపేట తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. 8న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 29వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్ కేటగిరీలో డి.జెస్సీలేకణ, కె.ఆస్య, కె.లాస్యాఆద్విక, జి.లాహితితేజ, ఎం.మౌనికలు బంగారు, డి.గిరిజ, ఎస్.కావ్య, సీహెచ్ఎన్ చిన్న వెండి, వి.దినేష్, ఇ.బంగారయ్య, బి.హేమహితిక్ కాంస్య పతకాలు సాధించారన్నారు. కెడిట్ విభాగంలో కాంస్య, జూనియర్ విభాగంలో వెండి, సీనియర్ విభాగంలో బంగారు పతకాలు పొందారన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. విజేతలను హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, తైక్వాండో కోచ్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

టెన్నికాయిట్ విజేతలకు ఘన స్వాగతం

పట్టణంలో ర్యాలీ, సన్మానం



వినయ్, రామారావులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, పృథ్వీరాజ్, రాజుబాబు తదితరులు

మండపేట: సౌత్ ఆఫ్రికాలో జరిగిన ప్రపంచ టెన్నికాయిట్ చాంపియన్ షిప్‌లో భారత్‌కు విజయాన్ని అందించిన మండపేట కుర్రాళ్లకు పట్టణ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీగా తీసుకువచ్చి ఘనంగా సత్కరించారు. టెన్నికాయిట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆరుగురిలో మండపేటకు చెందిన వడ్డాది వినయ్‌కుమార్, పిల్లా రామారావు ఉన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన ఫైనల్స్‌లో జర్మనీ జట్టుపై వీరు విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న విషయం విదితమే. పర్యటన ముగించుకుని సోమవారం ఉదయం వినయ్, రామారావులు మండపేట చేరుకోగా స్థానిక పెద్ద కాలువ వంతెన వద్దకు చేరుకోగా క్రీడా ప్రేమికులు, స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు, సామాజిక కార్యకర్తలు, వారిద్దరూ టోర్నీలో పాల్గొనేందుకు సహకరించిన దాతలు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ మెయిన్ రోడ్డులో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సురుచి ఫుడ్స్ బ్రాంచి వద్ద మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పీఆర్ఓ వర్మ ఇరువురికి బాహుబలి కాజాను అందజేసి సత్కరించారు. అనంతరం కలువపువ్వు సెంటర్ వద్ద కమ్మ మహాజన సంఘం భవనంలో వారిని సన్మానించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, బీజేపీ నేత కోన సత్యనారాయణ తదితరులు హాజరై వినయ్, రామారావు, కోచ్ కుంచే రమేష్‌లను సత్కరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సాయి ఆర్థో ట్రామా కేర్ అధినేత డాక్టర్ రాము, సొసైటీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎంపీఎస్ స్కూల్ చైర్మన్ వల్లూరి చిన్నారావు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యిమ్మిడిశెట్టి నాగభూషణం, వేమగిరి నూకరాజు, ముక్కా దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శౌర్య జాగరణ యాత్రకు ఘన స్వాగతం



రాజోలులో శౌర్య జాగరణ యాత్రకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

రాజోలు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న శౌర్య జాగరణ యాత్రకు సోమవారం రాజోలులో ఘన స్వాగతం లభించింది. అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తి కావొస్తున్న సందర్భంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు కోనసీమ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. బైక్ ర్యాలీ, మహిళల కోలాటంతో భజన చేస్తూ హనుమాన్ రథాన్ని ఊరేగించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, కొత్త పద్మావతి, నూలు శ్యామల, నీరజ, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, రాజా నాగరత్నకుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



బార్ అసోసియేషన్ వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

రామచంద్రపురం: న్యాయవాదుల సంక్షేమ నిధి పేరిట అన్ని దరఖాస్తులపై రూ.20 స్టాంపులు అంటించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఏకపక్ష నిర్ణయం తీసుకుందంటూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అలాగే మంగళ, బుధవారాల్లోనూ న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించాలని అసోసియేషన్ నిర్ణయించిందని అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయిప్రసాద్ తెలిపారు. రూ.20 స్టాంపుల విషయంలో పునరాలోచించాలని అన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ఎస్ శర్మ, జాయింట్ సెక్రటరీ చిన్నం వీర్రెడ్డి, కోశాధికారి చక్రవర్తి, కార్యవర్గ సభ్యులు పిల్లా పృథ్వీ, కె.సత్యవాణి, న్యాయవాదులు ఎం.సర్వారాయుడు, డీపీ శాస్త్రీ, వీవీఆర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై ఆందోళన

కాజులూరు: అప్రకటిత విద్యుత్ కోతలు అరికట్టాలంటూ ఆర్యావటం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఆక్వా రైతులు ఆందోళన చేశారు. ముందుగా కాకినాడ, కోటిపల్లి రహదారిపై ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. రైతు సంఘాల నాయకులు గోళ్ల శ్రీను, డేగల సత్యనారాయణమూర్తి, సత్తి శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ మృతికి సంతాపం



మాత గౌతమ్‌రాజు

కాజులూరు: నామవాని పాలేనికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మాత గౌతమ్‌రాజు (46) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అతను సోమవారం మరణించారు. సుమారు 25 ఏళ్లుగా పలు పత్రికల్లో పనిచేసిన గౌతమ్‌రాజు నామవానిపాలెంలో పలుమార్లు పంచాయతీ పాలకవర్గ సభ్యుడిగా, ఉప సర్పంచ్‌గా గెలుపొంది సేవలందించారు. ఎంపీపీ మాత భారతి, సర్పంచ్ భూపతిరాజు వెంకట సూర్యనారాయణరాజు తదితరులు సంతాపం తెలిపారు.

వివాహిత అదృశ్యం

కె.గంగవరం: కుందూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కె.గంగవరం ఎస్సై జానీ బాషా తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకర వీరవెంకటలక్ష్మి (25) ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లింది. ఇప్పటి నుంచి తిరిగి రాలేదు. ఆమె తల్లి యర్రంశెట్టి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సోమేశ్వరరావు కుటుంబానికి తోట పరామర్శ

మండపేట: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ముదుర్తి సోమేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. పార్టీ నేతలు ఓగిరాల దేవి, జిన్నూరి సాయిబాబా పరామర్శించిన వారిలో ఉన్నారు.


వైభవంగా అష్టోత్తర పూజలు



స్వామివారికి అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలను ఆలయ ఆలయ అర్చకులు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డ్రోన్ వినియోగంతో ఉపయోగాలు



కడలిలో డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేసే విధానాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రాజోలు: డ్రోన్ ద్వారా పంట పొలాల్లో మందులు పిచికారీ చేయడం ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త భరతలక్ష్మి అవగాహన కల్పించారు. సోమవారం కడలి గ్రామంలో వరి పంటపై తెగుళ్ల, పురుగుల నివారణకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేసే విధానం వివరించారు. కేవలం పది నిమిషాల్లో ఒక ఎకరం పొలంలో పురుగు మందును పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ వినియోగించడం ద్వారా సమయం, వ్యయం ఆదా చేసుకోవచ్చని అన్నారు.